క్లుప్తంగా

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి ఆహ్వానం



బండి సంజయ్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న విశోక తీర్థస్వామి, భక్తులు

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో నిర్వహించే శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమం స్వర్ణోత్సవాల ఆహ్వాన పత్రికను కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు శనివారం నిర్వాహకులు అందించారు. కరీంనగర్‌లో ఆయనను కలిసి ఫిబ్రవరి నెలలో 7, 8, 9 తేదీల్లో శ్రీ సత్యానంద ఆశ్రమ స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో శ్రీ విశోక తీర్థ స్వామి, రెంకల చిన్నమల్లయ్య, అంబల్ల సుశ్రీత్, బొలిశెట్టి శశి, సంక విష్ణు, రాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మెట్‌పల్లి: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించారు. వాటిని పెండింగ్‌లో పెట్టకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సాయి రాంకాలనీలోని ఓ వెంచర్‌ను పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ మోహన్ ఉన్నారు.

ఉత్తమ సేవలకు ఎల్లవేళలా గుర్తింపు



మనీషాను సన్మానిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఎల్లవేళలా గుర్తింపు లభిస్తుందని జిల్లా పశువైద్య,సంవర్ధక శాఖ అధికారి మనోహర్ అన్నారు. మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా ఇటీవల 'కిసాన్ సేవా రత్న జాతీయ అవార్డు' అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆమెను అభినందించి సత్కరించారు. వ్యవసాయ రంగానికి అనుబంధమైన పశువైద్యంలో విశేష సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్,వెటర్నరీ వైద్యులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న రఘువరన్

జగిత్యాలరూరల్: గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి పంచాయతీ కార్యదర్శి తిరుపతి మృతి తీరని లోటని జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ అన్నారు. శనివారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌లో తిరుపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎంపీడీవోలు రమాదేవి, రాంరెడ్డి, ఎంపీవోలు సురేశ్‌రెడ్డి, రవిబాబు పాల్గొన్నారు.

ముగిసిన శతచండీ యాగం



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శతచండీ మహాసుదర్శన నారసింహ యాగం ముగిసింది. శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. యాగంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల పోరుబాట..

• 'మా టీచర్లు మాకే కావాలని' ఆందోళన • కోరుట్లలో పాఠశాల గేటు వేసి ధర్నా • 45 నిమిషాలు వేచి ఉన్న ఎంఈవో, టీచర్లు • రాయికల్, సారంగాపూర్, మల్యాలలో కేజీబీవీ విద్యార్థుల నిరసన



కల్లూరు కేజీబీవీ లో ధర్నా చేస్తున్న విద్యార్థినులు



రాయికల్ మండలం ఉప్పుమడుగు కేజీబీవీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కోరుట్లరూరల్/రాయికల్/సారంగాపూర్/మల్యాల: తమ దీర్ఘ కాలిక డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 20 రోజులుగా నిరసన చేపట్టడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేజీబీవీకి పంపించి పాఠాలు బోధించేందుకు నియమించింది. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పాఠశాలకు వస్తున్నారని తెలుసుకున్న విద్యార్థినులు పాఠశాల గేటు మూసివేసి గేటు ముందు ధర్నా చేపట్టారు. మా టీచర్లు మాకే కావాలని నినదించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె బాట పట్టటంతో మండలంలోని పలు పాఠశాలల నుంచి వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులను కేజీబీవీలో తాత్కాలికంగా బోధించేందుకు ఎంఈవోలు పంపించారు. దీనిని అక్కడి విద్యార్థినులు తీవ్రంగా వ్యతిరేకించారు. పాఠశాలల గేట్లకు తాళాలు వేసి బైఠాయించి «మా టీచర్లు మాకే కావాలని» నినాదాలు చేశారు. కోరుట్ల మండలం కల్లూరు కేజీబీవీ, రాయికల్ మండలం ఉప్పుమడుగు కేజీబీవీ, సారంగాపూర్, మల్యాల మండల కేంద్రాల్లోని కేజీబీవీల్లో విద్యార్థినులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. టీచర్ల సమస్యలు పరిష్కరించి తమ టీచర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. తర్వాత ఎంఈవోలు, తహసీల్దార్లు కేజీబీవీలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పరిస్థితి తెలుసుకుందామని పాఠశాలలకు వచ్చారు. విద్యార్థినులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో వెంటనే టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



మల్యాల: విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో



కథలాపూర్: మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. విద్యాలయం మెయిన్ గేట్ ఎదురుగానే మురికినీరు ఉండటంతో విద్యార్థినులు బయటకు వెళ్లే సమయంలో దుర్వాసన వస్తుందన్నారు. అధికారులు చొరవ చూపి మురికినీరు నిల్వ లేకుండా డ్రెయినేజీ నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
రాజశేఖర్, ఎంపీవో, కథలాపూర్, సెల్ నంబర్: 9640807073

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి



దీక్షలో మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెలో పీఆర్‌టీయూటీఎస్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సమ్మెలో భాగంగా శనివారం దీక్షా శిబిరం వద్ద వంటావార్పు చేపట్టిన ఉద్యోగులు అక్కడే భోజనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏడాది పూర్తయినా ఉద్యోగులకిచ్చిన హామీపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బర్ల నారాయణ, కుడుకల రవీందర్, నీరటి అంజయ్య, చిట్యాల రవి, సంతోష్‌చారి, స్నేహలతతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు టేకు మహేందర్, కిడ్స్ జావెలిన్ త్రోయింగ్ విభాగంలో, డి.అమూల్య కబడ్డీ విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం రాజన్న శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందచేసి అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన వాసాల రమ, సీహెచ్ ముత్తయ్యలకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్య చికిత్స కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎల్‌వోసీని మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు శనివారం తెలిపారు. రమకు రూ. 1.50 లక్షలు, సీహెచ్ ముత్తయ్యకు రూ.1.75 లక్షలు ఎల్‌వోసీ మంజూరైందన్నారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై గీత

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై గీత అన్నారు. శనివారం పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో పోలీసు కళాబృందం చేత యాంటీ డ్రగ్స్ సైబర్ నేరాలు, షీటీం, రోడ్డు ప్రమాదాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు మోసాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌చార్జి సౌజన్య, పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, రజిత, అజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనవరి 4 నుంచి నిరవధిక సమ్మె



ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందిస్తున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: తమ సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని, తమ డిమాండ్లను జనవరి 3లోపు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని పంచాయతీ కార్మికులు తెలిపారు. ఈమేరకు శనివారం ఎంపీడీవో గంగాధర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, జీవో 51ని సవరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో జనవరి 4వ తేదీ నుంచి అన్ని గ్రామపంచాయతీల్లో విధులు బహిష్కరించి సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు.

మల్యాల: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం పంచాయతీ కార్మికులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఒకరోజు దీక్ష చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కోరేపు మల్లేశం, మ్యాక దేవయ్య, గసిగంటి శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



మల్లాపూర్: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్: భారత ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని ఏపీఎం గంగాధర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్, అర్బన్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సీసీలు విద్యాసాగర్, రవీందర్, గంగారాం, శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షులు మారు సత్తవ్వ, దేశవేని గంగభవాని, ఓబీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప నేతను కోల్పోయిందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మల్లాపూర్‌లో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి,గొండ రాజేందర్, పూండ్ర లక్ష్మారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలు వేసి గ్రామస్తులు నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దెశెట్టి జీవన్, మాజీ ఉపసర్పంచు రాజేశ్వర్, మాజీ సర్పంచు పుప్పాల నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



కవితను సన్మానిస్తున్న రంగాచార్యులు

ఇబ్రహీంపట్నం: విజయవాడలో 6 వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో శనివారం ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు కటకం కవిత కవితాగానం చేశారు. ఆమెను అభినందిస్తూ రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు, కందెపి రాణి ప్రసాద్, భోగరాజు శ్రీలక్ష్మి అభినందించి, సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

వైద్యులకు సన్మానం

కోరుట్ల: పట్టణానికి చెందిన కోరుట్ల మెట్‌పల్లి ప్రసూతి వైద్యం,గైనకాలజిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా వైద్యులను ఏఐఎంఐఎం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అధ్యక్షురాలు డాక్టర్ వై. స్వీటీ అనూప్,వై. అనూప్ రావు, రీతూ రావు, నిశ్చల్ రావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోరుట్ల అధ్యక్షుడు రఫీ, నాయకులు వాజిద్, రహీం, హఫీజ్, మజూర్, రౌఫ్,సమీర్, చాంద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభకు తరలిన జిల్లా ప్రతినిధులు

జగిత్యాల: నల్గొండ జిల్లాలో జరుగుతున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలకు జగిత్యాల జిల్లా శాఖ ప్రతినిధులు వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

రాయికల్: రైతులకు రూ.2 లక్షల వరకు రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాదారు పాస్‌బుక్ ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల: మండలంలోని పోతారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్ ను శనివారం పాక్స్ కార్యాలయంలో పాలక వర్గ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ అయిల్నేని సాగర్ రావు, సీఈవో గంగరాజం, పాలక సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మహిళా శక్తి కార్యక్రమాలు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: మహిళా శక్తి కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఏపీఎం గంగాధర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్, అర్బన్ మండల సమైక్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన టార్గెట్‌ప్రకారం బ్యాంక్ లింకేజీ పూర్తి చేయడం స్త్రీనిధి ద్వారా పాడిగేదెల కొనుగోళ్లు, ఎంటర్‌ప్రైజెస్ ఏర్పాటు, మహిళ శక్తి కార్యక్రమాల ద్వారా వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు సాగర్, రవీందర్, గంగారాం, శ్రీనివాస్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేశాపూర్‌లో శనివారం కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా 120 మంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులను అందచేశారు. కార్యక్రమంలో మెడికేర్ ఆసుపత్రి వైద్యులు శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి..

కోరుట్ల: పట్టణంలోని రెనే గ్రూప్ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 50 మంది రక్తదానం చేసినట్టు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సమీర్, బత్తిని అనుదీప్, ఆకీఫ్, నవీన్, పాషా,లత, వనజ,రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

పూజాసామగ్రి దుకాణానికి వేలం

జగిత్యాలటౌన్: విద్యానగర్ శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ ఆవరణలో పూజాసామగ్రి షెడ్ నిర్వహణకు అధికారులు శనివారం వేలం పాట నిర్వహించారు. రూ. 81 వేలకు కె.చిన్నారెడ్డి షాపును దక్కించుకున్నారు. కమిషనర్ దేవాదాయశాఖ ఉత్తర్వులకు లోబడి షాపు నిర్వహించుకోవాలని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితితో పూజా సామగ్రి విక్రయాలు జరుపుకోవాలని, మార్కెట్ రేటు కంటే 5 శాతం మించకుండా అమ్మకాలు జరపాలని పేర్కొన్నారు.

పేదకుటుంబానికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో పేద కుటుంబానికి చెందిన కాతం జమున అనారోగ్యంతో ఇటీవల మరణించగా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెగడపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండావిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, విజయభాస్కర్, శ్రీనివాస్, మల్లారెడ్డి, కిషన్, తిరుపతి, అనిల్‌గౌడ్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ



కంప్యూటర్, ప్రింటర్ అందిస్తున్న దాతలు

పెగడపల్లి: చదువుకున్న పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణగా ఇచ్చి పాఠశాలపై మమకారం చాటుకున్నాడో పూర్వ విద్యార్థి. పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న గ్రామానికి చెందిన బోయినపల్లి శాంతపురావు (ఎస్‌ఆర్‌ఐ) సమకూర్చిన రూ. 40 వేల విలువ గల కంప్యూటర్, ప్రింటర్, మానిటర్‌ను పద్మనాయక వెల్మ సంక్షేమ సంఘం నాయకులు పొట్లపల్లి నర్సింగారావు, పానుగోటి శాంతపురావు శనివారం ఉపాధ్యాయులకు అందజేశారు. హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి ఇరుక్కుంది



డబ్బాలో ఇరుక్కున్న కుక్క తల

జగిత్యాలటౌన్: ఆకలిలో ఎక్కడ ఏది కనిపిస్తే దాంట్లో తల దూర్చడం శునకాలకు సర్వసాధారణం. జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఈ ఘటన శునకాన్ని ఇబ్బంది పాలు చేసింది. ఆహార వేటలో భాగంగా ఓ శునకం ప్లాస్టిక్ డబ్బాలో తలపెట్టింది. తల అందులో ఇరుక్కోవడంతో ఎలా బయటకు తీయాలో తెలియని శునకం ఇబ్బంది పడటం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో కనిపించింది. ఇది గమనించిన కొందరు జంతు ప్రేమికులు శునకం తల నుంచి ప్లాస్టిక్ డబ్బాను తొలగించేందుకు ప్రయత్నం చేయగా భయంతో శునకం అక్కడి నుంచి పారిపోయింది.